క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

మంత్రాలయం రూరల్: పత్తి, మిరప విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ సాలు రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సిద్ధి వినాయక అగ్రో ఏజెన్సీస్, వీరభద్రేశ్వర ఎంటర్ ప్రైజెస్ దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాలకు, రికార్డులకు తేడా ఉండటంతో రూ.31.47 లక్షల విలువ చేసే విత్తనాలను సీజ్ చేశారు. రికార్డులను అప్‌డేట్ చేసుకున్న తర్వాత విక్రయాలు జరపాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వకపోయినా, స్టాక్ వివరాలు, ధరల పట్టిక ఏర్పాటు చేయకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఏడీఏ మహ్మద్‌ఖాద్రీ, ఏఓ జీరాగణేష్ ఉన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో బుధవారం నుంచి వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని స్థానిక గ్రంథాలయాధికిరిణి వసంతలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు.

నేడు చేనేత యంత్ర పరికరాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 10వ తేదీన ఆదోనిలో జరిగే కార్యక్రమంలో చేనేతకారులకు ఆధునాతన పరికరాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. ఆదోని వీవర్స్ కాలనీలోని నీలకంఠేశ్వర ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆధునాతన వస్త్రాల తయారీకి అవసరమయ్యే దాదాపు రూ.40 లక్షల యంత్రాలు, ఇతర పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సృజన, ఎంపీ సంజీవ్ కుమార్, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. త్వరలోనే ఎమ్మిగనూరులో కూడా ఈ పరికరాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

అందుబాటులో ఎరువులు

కౌతాళం: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని,కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకుని తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని యూరియా, కాంప్లెక్స్ ఎరువులను బుధవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుతున్నట్లు చెప్పారు.

వేతనాలు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న

పెద్దకడబూరు: రెండు, మూడు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీలను తక్షణమే మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు మంగళవారం కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న పని ప్రదేశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వలసలను నివారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రాధమ్మ పాల్గొన్నారు.

నేడు నదిచాగిలో సమావేశం

కౌతాళం:నదిచాగి సచివాలయంలో బుధవారం మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటల్లోపు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

వీఓఏలకు శిక్షణ తరగతులు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం జయశ్రీ, ఏపీఓ తిమ్మారెడ్డి, ఈసీ శ్రీనివాసులు, ఎల్‌సీ మధు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వీఓఏలకు లోకోస్ ట్రైనింగ్ యాప్ గురించి శిక్షణ ఇచ్చారు. ఆయా గ్రామాలకు సంబంధించిన డ్వాక్రా గ్రూపుల డేటా పూర్తిగా ఉంటుందని, వీఓఏలు ఎలాంటి చర్యలు తీసుకోవాల అంశాలపై అవగాహన కల్పించారు.

● టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల సమయంలో ఫెయిల్ అయిన విద్యార్థుల్లో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు ఏటా చూస్తూనే ఉన్నాం. కొందరైతే పాస్ అయినా మార్కులు తక్కువగా వచ్చాయనే మనస్తాపంతో లోకాన్ని వీడుతుండటం మరింత బాధాకరం. ఈ యేడాది తాజాగా విడుదలైన ఇంటర్, టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత కాలేదని, మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపానికి గురై రాష్ట్రవ్యాప్తంగా 9 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు.

● చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుంది. కానీ చదువు లేనిదే జీవితం లేదనేది నిజం కాదు. పరీక్షలో తప్పితే జీవితం ముగిసిపోయినట్లు కాదు. మరోసారి ప్రయత్నించి పాస్ కావొచ్చు. కానీ ప్రాణం తీసుకుంటే తిరిగి రాదు. ఈ విషయం విద్యార్థులు గ్రహించుకోవాలి. తల్లిదండ్రులు కూడా ఫెయిల్ అయిన తమ పిల్లలను మందలించరాదు. మరోసారి బాగా రాస్తే పాస్ అవుతావని ధైర్యం చెప్పాలి.

● గెలుపుదేముంది మహా అయితే నిన్ను ప్రపంచానికి పరిచయం చేస్తుంది. అదే ఒకసారి ఓడి చూడు ప్రపంచమే నీకు పరిచయమవుతుంది అన్నాడో సినీ రచయిత. ఇది అక్షర సత్యం. ఓటమి విజయానికి నాంది. ఓటమిని తలుచుకుంటూ కుంగిపోతే ప్రపంచంలో ఇన్ని అద్భుతాలు ఆవిష్కృతమయ్యేవా.... ఎన్నో ఓటముల తర్వాతే శాస్త్రవేత్తలు విజయాలు సాధించారు. ప్రతిరోజూ మనం చూస్తున్న, వింటున్న వారిలో ఒకప్పుడు ఫెయిల్ అయిన వాళ్లే క్రికెటర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఉన్నారు. ఇలా ఓటమి అనుకుంటే వాళ్లు విజయం సాధించేవారా విద్యార్థీ ఓసారి ఆలోచించు..

విద్యార్థీ..జీవితం చాలించొద్దు

● ఫలితం ఏదైనా ప్రశాంతంగా ఆలోచించు
● మరోసారి గెలిచేందుకు ప్రయత్నించు
● ప్రాణం తీసుకుంటే తిరిగిరాదు



ఆదోని అర్బన్: ఇంటర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఆ తర్వాత పీజీ, డిగ్రీ పరీక్షా ఫలితాలు వెలువడనున్నాయి. ఇటీవల వెలువడిన పది ఫలితాలు కొందరికి తీపి జ్ఞాపకాలను మరికొందరికి చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలను కనబరిచిన వారు కొందరైతే ఓడిన వారు మరికొందరు ఉన్నారు. పరీక్ష తప్పామన్న ఆవేదనతో క్షణికావేశానికి లోనై తనువు చాలిస్తున్నారు. పరీక్షా ఫలితాల ప్రభావంతో ప్రాణాలు తీసుకున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇటువంటి ఘటనలు తల్లిదండ్రులను తీవ్రమైన ఆందోళనలకు గురి చేస్తున్నాయి. ఫలితాలు ఎలా ఉన్నా విద్యార్థులు కాసేపు ప్రశాంతంగా ఆలోచించుకుని ఆత్మవిమర్శ చేసుకోవాలని విద్యావేత్తలు, మానసిక వేత్తలు సూచిస్తున్నారు. ఆందోళన, ఒత్తిడికి గురిగాకుండా ఉండాలి. తప్పును సరిదిద్దుకుని మరలా ప్రయత్నిస్తే విజయం వరిస్తుంది. ఉత్తీర్ణత సంతోషానికి బలం ఇస్తే ఓటమి విజయానికి బాటలు వేస్తుందన్న నిత్య సత్యాన్ని ప్రతిఒక్కరూ గమనించాలి. కష్టపడి చదవాలి, మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో చదవాలి. మన ప్రయత్నంలో లోపం లేకుంటే ఫలితం ఎలా ఉన్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

భరోసా కల్పించాలి

పిల్లలు అనుకున్న మార్కులు సాధించలేదనో, పాస్ కాలేదనో వారిని మందలించకూడదు. ఫెయిల్ అయిన బాధలో కుంగిపోయి ఉన్న వారి మనసును మరింతగా గాయపరిస్తే తీవ్రమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. వారిని ఆ సమయంలో తల్లిదండ్రులు అక్కున చేర్చుకోవాలి. మేమున్నామన్న భరోసాను తల్లిదండ్రులు ఇవ్వాలి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పోలుస్తూ హేళన చేయరాదు. గెలుపు, ఓటములను విద్యార్థులు సమానంగా తీసుకోవాలి. పాస్, ఫెయిల్ అనేది విద్యార్థి దశలో సాధారణం. ఓటమి మరో విజయానికి నాంది కావొచ్చు. అంతమాత్రాన కఠిన నిర్ణయాలు తీసుకోకూడదు.

ఆత్మస్థైర్యం కోల్పోవద్దు



మార్కులు రాలేదని, ఫెయిల్ అయ్యానని విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు. అన్ని జన్మలలోకెల్లా మానవ జన్మ అత్యుత్తమమైనది. మానవ జన్మ ఓ వరం. అలాంటి జీవితాన్ని చిన్న సమస్యను ఎదుర్కోలేక ఆత్మహత్యలు చేసుకోవడం పిరికితనం. పది, ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారు ప్రస్తుతం మరలా పరీక్షరాసి, ఐఏఎస్, ఐపీఎస్ అయిన వారు ఎందరో ఉన్నారు. అసమర్థుడిననే భావన పెట్టుకోరాదు. కృషితో ముందుకెళ్లాలి. సూసైడ్ చేసుకుని తల్లిదండ్రులకు మనోవేదన మిగిల్చవద్దు.

– శ్రీరామ్, త్రీటౌన్ సీఐ

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకడబూరు: పెద్దకడబూరు, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 500లకు పైగా మార్కు లు సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీటీ ఏరియా టీం లీడర్ సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకు ఆర్డీటీ ఉచిత చదివిస్తుందన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు ఫారంతో పాటు 10వ తరగతి హాల్ టికెట్, మార్కుల జాబితా, ఆధారు కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలు జత చేసి ఈనెల 15వ తేదీలోపు ఎమ్మిగనూరులోని ఆర్డీటీ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 29న ఆదోనిలో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 94906 42445 లేదా 96320 26528 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు

గోనెగండ్ల: గోనెగండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక(బస్టాండ్) పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ప్రారంభిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో 5వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధ న ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిష్కార వేదిక.. 'జగనన్నకు చెబుదాం'



ఆదోనిలో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఉద్యోగులు, కౌన్సిలర్‌లు

ఆదోని టౌన్/రూరల్/కౌతాళం: జగనన్నకు చెబుదాం కార్యక్రమం సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక అని పలువురు అభిప్రాయపడ్డారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆదోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రఘురాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గీతావాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణమ్మ, ఎంపీపీ దానమ్మ, ఎంఈఓ శివరాములు, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న లబ్ధిదారులు టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు సమయంలో ప్రతి ఒక్కరికీ వైఎస్‌ఆర్ ఐడీని కేటాయిస్తారని, దాని ప్రకారం సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. ప్రతి దశలో ఫిర్యాదుదారుడి సెల్‌కు మెస్సేజ్ వస్తుందని, చివరిలో సమస్య పరిష్కారమైతే లబ్ధిదారుడు తన సంతృప్తి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మరోసారి జగనే సీఎం



వైఎస్సార్‌సీపీలోకి చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: 2024లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావడం ఖాయమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో వగరూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కట్టికె పీర్ సాబ్ కుమారులు, బంధువుల కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చిన్నన్న, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



దర్శనమిస్తున్న మాతా పరమేశ్వరిదేవి



అమ్మవారికి పొంగళి నైవేద్యం చేస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలిసిన మాతా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించానరు. వేకువజాము నుంచి విశేష పూజలు, అర్చన, కుష్మాండ బలిహరణం పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మహిళలు పొంగళి నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో త్రీటౌన్ సీఐ శ్రీరామ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పురవీధులగుండా రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, కొండయ్య, రామకృష్ణ, నరసింహులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంను, పడవను చూపుతున్న ఎస్‌ఐ

కౌతాళం: భారీగా కర్ణాటక మద్యాన్ని కౌతాళం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపిన వివరాలు.. మద్యం తరలుతుందనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కడిదొడ్డి గ్రామానికి చెందిన బండెప్ప కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యంను గుర్తించారు. 20 బాక్స్‌ల్లో 90ఎంఎల్ కల్గిన 1094 ఒరిజినల్ ఛాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను, మద్యంతో తుంగభద్ర నది దాటడానికి ఉపయోగించిన తెప్ప (పడవ)ను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరళిలో..

మండల పరిధిలోని గోతులదొడ్డి గ్రామానికి చెందిన ఎద్దులదొడ్డి నగేష్ మాన్వి నుంచి నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా మరళి క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. 6 బాక్స్‌ల్లో 576 కర్ణాటక మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఘనటలో మరో నిందితుడు పారిపోయాడన్నారు. తనిఖీల్లో పోలీసులు హుసేన్, రంగన్న, నరేంద్ర, మల్లికార్జున, నాగరాజు పాల్గొన్నారు.

ఆదోనిలో ఇద్దరు అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణంలోని ఎరుకల కాలనీకి చెందిన కురువ దస్తగిరి, నిజాముద్దీన్ కాలనీకి చెందిన చాకలి సిద్ధార్థ మోటార్‌సైకిల్‌పై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు పెద్దతుంబళం ఏఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం నాగరహాల్ నుంచి అక్రమంగా తరలిస్తుండగా హానవాల్ సమీపంలోని ఎల్లెల్సీ వద్ద పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి బొకే అందజేస్తున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని సీఐ శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మండలంలోని పలు అంశాల గురించి చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



బుక్‌లెట్ అందజేస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని ఓంనగర్ ఎస్సీ కాలనీ, సింగరాజనహళ్లి గ్రామాల్లో మంగవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల పాలనలో ఏఏ పథకాలు అందాయనే అంశాల గురించి ఆరా తీసి బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కిరణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ఉన్నారు.



స్కానింగ్ పరీక్షల కోసం పేర్ల నమోదు వద్ద కౌంటర్ వద్ద బారులుతీరిన గర్భిణులు

బారులు తీరారు



గర్భిణుల పేర్లు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి గర్భిణులతో కిక్కిరిసింది. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా స్కానింగ్ చేయించుకునేందుకు మంగళవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు తరలివచ్చారు. అయితే, కొందరు వైద్య పరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. కాగా మంగళవారం 360 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరిండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు.

దేవరకు బందోబస్తు ఏర్పాటు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ గ్రామంలో మంగళ, బుధవారాల్లో జరుగుతున్న గ్రామదేవత దేవరలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి, పెద్దతుంబళం సీఐ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. గ్రామంలో రెండువర్గాల మధ్య ఉన్న విబేధాల కారణంగా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో దేవర ఉత్సవాలను జరుపుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

చీలిన కొండను పరిశీలించిన అధికారులు



కొండ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో నరసప్ప దేవాలయం దగ్గర ఉన్న కొండను విపత్తుల శాఖ జిల్లా మేనేజర్ అనుపమ, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌లు మంగళవారం పరిశీలించారు. ఎండవేడిమికి ఏప్రిల్ 9వ తేదీ మధ్యాహ్నం ఈ కొండ చిలిపోయిన సంగతి తెలిసిందే. ఈ విషయమై ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్ సృజనను కలిసి కొండను తొలగించి కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని కోరారు. దీంతో విపత్తుల శాఖ, మైనింగ్ అధికారులు తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి కొండను పరిశీలించారు. కొండ రెండుగా చీలిన సంఘటనపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కాలనీ వాసులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం కొండను పరిశీలించిన నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు వారు తెలిపారు.

పట్టుబడిన వాహనాలు వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన 15 వాహనాలకు మంగళవారం నంద్యాల సెబ్ సూపరిండెంట్ శ్రీదరరావు ఆధ్వర్యంలో సెబ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో వేలాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వాహనాలకు వేలాలు నిర్వహిచటం జరిగిందని చెప్పారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధర రూ. 1,78,.000 కాగా పోటీలో రూ.3,17,500 వచ్చిందని, అలాగే జీఎస్టీ కింద మరో రూ. 57,100 వసూలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ జయరాంనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విక్రమసింహ

ఆదోని అర్బన్: స్థానిక బోయగేరికి చెందిన సారా విక్రేత బోయ శీనును వన్‌టౌన్ పోలీసులు మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. సీఐ విక్రమసింహ తెలిపిన వివరాలు.. సారా తయారు చేస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు సోదాలు చేశారు. తల్పారి తనీషా ఎదురుగా సుల్తాన్‌పురానికి సమీపంలోని కొండల్లో నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. 350 లీటర్ల సారా ఊటను పారబోశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. బోయ శీనును అతనికి సహకరించిన బోయగేరికి చెందిన రామయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సోదాల్లో పోలీసు సిబ్బంది హాజీబాషా, రంగస్వామి, వీరారెడ్డి, మద్దిలేటి, ముస్తాక్ పాల్గొన్నారు.